# మనిషిలో మనిషి

వీరాస్వామి పేరు చెప్తే గుర్రాలు నీళ్ళు త్రాగుతాయో తాగవో కాని, ఆ ప్రాంతితోపాటు చుట్టుపట్ల అన్ని ఊళ్ళల్లోనూ కూడా చంటి పిల్లలు మాత్రం పేచీలు మానేసి గబగబా పాలుతాగేస్తారు. 'వీరాస్వామిని పిలుస్తాం' అంటే చాలు ఎంత చేదు మందయినాసరే గుటుక్కున మింగేస్తారు. ఇంక అల్లరి చేసే అబ్బాయిలూ, ఆగడంచేసే అమ్మాయిలూ సరేసరి, అల్లరీ ఆగడం మానేసి గుప్ చుప్ గా కూర్చుంటారు. 'వీరాస్వామికి ఇచ్చేస్తాం అంతే' అని పెద్దాళ్ళు అనేసరికి.

దుబ్బులా ఎండిపోయి గాలి కెగురుతూన్న బిరుసైన ఉంగరాల జుట్టూ పెద్ద పెనంలా నల్లగాఉన్న ముఖంలో ఎప్పుడూ ఖణఖణ లాడే చింతనిప్పుల్లాంటి ఎర్రనికళ్లూ, సూదిగా పొడుగ్గావున్న ముక్కు కింద బొద్దుగా ఒత్తుగా చివరలు సన్నని బాకుల్లా పెరిగిన మీసాలూ, చెవులకి

బెత్తెడు కిందదాకా పెంచిన చెంపలూ, రెండు మూడు తెల్లని బొల్లి మచ్చలున్న నల్లని పెదిమలూ, మెడకి బిర్ర బిగుసుకుని ఉన్న రాగి తాయెత్తూ, జబ్బకి కడియం, బొడ్డు పైన నల్లని బొజ్జమీదకి ఎగదీసుకు పోయిన బనీనూ, బొడ్డు కిందుగ్గా ముడేసిన గళ్ళలుంగీ, చేతిలో తనంత పొడుగూ ఆరడుగులున్న లావాటి చేపాటికర్రా, చెప్పులు లేని మోట పాదాలూ, ఎత్తయిన నల్లని ఆ లావుపాటి విగ్రహాన్ని హఠాత్తుగా చూస్తే పిల్లలేవిటి, పెద్దలే ఝడుసుకుంటారు.

వీరాస్వామిని కొందరు కలియుగ రాక్షసుడంటే మరికొందరు మనుష్యుల పాలిటి మహామ్మారి అంటారు. జాలీ దయా ఇతనికి ఏకోశానా లేవు. పొరపాటున భగవంతుడు గుండె పెట్టడం మరచిపోయాడు కాబోలని కొంతమంది అనుకుంటే తలకూడ లేదు, ఏకకుమ్మడానికి వచ్చే ఆంబోతులా ప్రతీ తగాదాలోకి కళ్ళుమూసుకుని జొరబడి పోవడమేకాని ఓ ఆలోచనా పాలోచనా ఉంటేగా, అని మరికొందరనుకుంటారు.

వీరాస్వామితో తగాదా పెట్టుకోవడం అంటే మృత్యువుతో చెలగాటం ఆడడమే అని కొందరి అభిప్రాయం అయితే, అతను అవునన్నది కాదనడంకంటే తీరి కూర్చుని నడి కొప్పుకి నిప్పంటించుకోవడం మేలు, అని మరికొందరి నమ్మకం. అందుకే ఆ చుట్టుపట్ల గ్రామాల్లో పది కాలాల పాటు బతకదలుచుకున్న వాడెవడూ వీరాస్వామికి కోపం తెప్పించడు. అతనితో ఘర్షణపడడు. అంతగా సరిపడక

తేపో అతని పరిధిలోకి రాకుండా అలాఅలా దూరంగా తిరుగుతాడు. అంతే-

అది ఎంత విలువైన వస్తువు కానీండి, వీరాస్వామి అడిగాడంటే ఇవ్వాల్సిందే.

– ఎంతముఖ్యమైన పని అయినాసరే అతను వీల్లేదంటే ఆగాల్సిందే.

ఆ చుట్టుపట్ల గ్రామాల్ని అతడలా ఏలుతున్నాడు. వాళ్ళ ప్రాణానికి అతనొక రాక్షసుడు. ప్లేగు-మహమ్మారి-తప్పనిసరి తద్దినం!

వీరాస్వామి గురించి రకరకాల కథలు.

ఓ మాటు రామాలయంలో పురాణం వింటూన్న జనం మధ్యకి రెండు బారల త్రాచుపాము వచ్చి బరిమీద ఆడుతూంటే, వీరాస్వామి అమాంతం వెళ్ళి దాని పడగని వాటంగా దొరకపుచ్చుకుని, గుప్పిడితో గట్టిగా పిండి విషంతో పాటు రక్తం కూడా దానిచేత కక్కించి ఆ తర్వాత తలభాగం ఒకచేతికి, తోకభాగం మరోచేతికి చుట్టుకొని మెలిపెట్టి పురుకొసని తెంపినట్టు, అంతబారు పాముని పుటుక్కున మధ్యకి తెంపాట్ట.

మరోమాటు 'నా పెళ్ళాంబిడ్డలు రాత్రి పస్తున్నారు, తవ్వెడు బియ్యం అరువు ఇమ్మంటే ఇయ్యనట్టా?' అంటూ ఊరికంతకీ పెద్దషావుకారైన వరహాలసెట్టిని, పక్కకితోసేసి కొట్లోంచి రెండు కాటాబస్తాల బియ్యం అయితే, ఎత్తుకుని రెండూ రెండు భుజాలమీదా వేసుకుని నడిబజారులోంచి దర్జాగా నడిచి వెళ్ళిపోయాట్ట. అక్కడజేరిన వందమందిలోనూ

'అదేమిటి' అని అడగటానికి ఒక్కడికీ దమ్ములు లేకపోయాయట!

ఇంకోమాటు పందెంవేసి నాలుగంగుళాల వాసం మేకుని నేలమీద తలక్రిందులుగా నుంచోపెట్టి గట్టిగా కాలి మడమతోటి ఒక్క తొక్కు తొక్కి వంచేశాట్ట. కాలిలో ఆ మేకు దిగబడడంకాని, కాలికి చిన్న గాయం తగలడం గాని జరగలేదట.

ఓ మారు కోపంవచ్చి వీరాస్వామి పోలీసు కానిస్టేబిల్ని ఊచి పుచ్చుగ్గొట్టాడనీ, సాక్ష్యం ఇస్తానని ముందుగు వచ్చిన ఓ శాస్త్రుల్లుగారి నాలికని కత్తి తీసుకుని అక్షరాలా కోసేస్తానన్నాడనీ, కోశాడో లేదోకాని నోట్లో నాలిక లేకుండా ఆయన మాత్రం చాలా రోజులు బతికాడనీ, పదేళ్ళనుంచీ పబ్లిగ్గా గవర్నమెంటువారి పోరంబోకుని ఆక్రమించుకుని అతను వ్యవసాయం నాగిస్తూంటే అదేవిటని కరణం కాదుకదా కలెక్టరుకూడా అడగలేకపోయాడనీ, ఒకమాటు అతని ఎనిమిదేళ్ళ కొడుకుమీదా చెయ్యిచేసుకున్నాడని, రావులయ్య కాఫీకొట్టుమీద పడి, పాకలో వస్తువులన్నీ చిందరవందర చేసేసి, పాకకి నిప్పంటిస్తే 'ఇదేం పని వీరాస్వామీ!' అని ఊళ్ళో పెద్దమనుషుల్లో ఒక్కడు కూడా అనలేక పోయాడనీ - ఇలా ఎన్నికథలో ఎన్నికథలో అతన్ని గురించి.

వీరాస్వామి అంతటి ప్రమాదమైన వ్యక్తికనకే, రచ్చబండమీంచి అతనలా ఉవ్వెత్తుగా లేచేసరికి, చుట్టూఉన్న

జనమంతా కంగారు పడ్డారు, ఇవాళేం ఘోరవిపత్తు జరుగు తుందో రా భగవంతుడా అనుకుంటూ.

అప్పటిదాకా నోట్లో నానినచుట్ట ముక్కని తుబు క్కున నేలమీద ఉమ్మేసి, రావిచెట్టుని జేరేసిన చేతికర్రని తీసుకుని "ఏటీ? ఎవడో బళ్ళో కుర్రాడి మీంచి నారీ పోయిందా? ఈ డ్రైవర్లకి వొళ్లు తెగబలిసిందిలే - ఒహణ్ణి ఏసేస్తేనే కాని తక్కినోళ్ళకి తెలిసిరాదు' అంటూ నిప్పుల రథంలా బయలుదేరాడు వీరాస్వామి.

ఈ పాటికి లారీ వదిలేసి పారిపోతేనే శివాయికాని, లేకపోతే నిష్కారణంగా ఆడ్రైవరెవరో మన వీరాస్వామి చేతిలో ఇవాళ ఆహుతి అయిపోతాడ'ను కున్నారు ఊళ్ళో జనం.

కొందరు 'అలా వెళదాం. ఆడ్రైవరు ఏమైపోతాడో' అన్నారు.

మరికొందరు 'ఏం? అడ్డుకుంటారా? ఆ కోపంలో డ్రైవర్ని మాని మీ నెత్తిన పెడతాడు ఆ దుడుకర్ర... వెళ్ళింది వీరాస్వామి! మరిచిపోతున్నారు కాబోలు!' అన్నారు.

అయినా కొందరు పెద్దలు, ఎటు నుంచి ఎటొస్తుందో అనే భయంతో జంకుతూ, వీరాస్వామి వెనకాలే బయల్దే రారు, వీలైతే డ్రైవర్ని పారిపొమ్మని చెబుదాం అనే ఉద్దేశంతో -

నేల అదిరిపోయేలా పెద్ద పెద్ద అంగలతో ముందు వీరాస్వామి.

గుండెలు చేత్తో పట్టుకుని బితుకు బితుకు మంటూ వెనకాలే, ఊళ్ళో పెద్దలు పాతిక గజాలు గడిచి రోడ్డుమలుపు తిరిగారో లేదో, ఎదురు గుండా కనిపించింది. మదించిన ఎర్ర ఏనుగులా రోడ్డు మధ్య ఆగివున్న లారీ. ఆ లారీముందు కోలాహలంగా మూగిన జనం.

"అయ్యో పాపం ఎవరి కుర్రాడో !"

'ముందా లారీలో డ్రైవర్ని కిందికి లాగి తన్నండెహే'

'అలా మీద పడిపోకండి, ముందా చక్రం క్రింద పడిన కుర్రాడిని తియ్యనీండి.'

'ఎవరబ్బాయో కాని పాపం తొడ దగ్గర చర్మం అంతా నలిగిపోయి ఎముకలన్నీ విరిగిపోయి, కాలు వేళ్ళాడి పోతుంది. రామ, రామ !'

'రక్తం మడుగులోంచి ముందా కుర్రాణ్ణి తియ్యండ్రా ! స్పృహ కోల్పోయినట్టున్నాడు.'

'డ్రైవరు అలాగే కూచున్నాడేం? దిగడేం ?' వాణ్ణి లాగి తన్నండి - కొట్టండి - చంపండి'

కేకలతో అరుపులతో ఆ ప్రదేశం అంతా కల్లోలంగా ఉంది. ఒకరి మాట ఒకరికివినిపించకుండా ఎక తొడతొక్కిడిగా ఉన్నారు వాళ్ళంతా.

ఆదుర్దాగా ఎవరిమట్టుకు వాళ్ళే ముందున్న వాళ్ళ మీద చేతులు ఆన్చి, ఒంగుని, మడమలు ఎత్తి మరీచూస్తు

న్నారు. మూగిన జనం తలల మధ్యనించి బోర్లపడివున్న ఆ కుర్రాడయితే ఎవరికీ సరీగ్గా కనిపించడంలేదు కాని, వాళ్ళ కాళ్ళసందుల్లోంచి తప్పించుకొని అతని రక్తం మాత్రం, రోడ్డు అంచుల వేపుకి, సన్నని జాలులా కదుల్తూ జాలిగా కనిపించింది.

ఎర్రని కన్నీరులా ప్రవహిస్తున్న రక్తం!

కళ్ళని జిగేల్ మనిపించేటంతటి చిక్కదనంతో మెరుస్తున్న రక్తం!

ఒక మనిషి కారణంగా మరో మనిషికి జరిగిన అఘాయిత్యానికి, నిశ్శబ్దంగా ఏడుస్తూ, నిస్సహాయంగా పక్కకి తప్పుకుంటూన్న రక్తం!

ఆ రక్తాన్ని చూసేసరికి వీరాస్వామికి ఒళ్ళు తెలియలేదు. ఆవేశంతో ఒళ్ళంతా ఊగిపోతూంటే పట్టలేని కోపంతో దవళ్ళు రెండూ కదిలిపోతూంటే, రెండుచేతుల్తోటీ చేతికర్ర ఎత్తి పట్టుకొని లారీ దగ్గరకి ఒక్క ఉరుకు ఉరికాడు.

వెనకాలే వస్తూన్న ఊరి పెద్దలు కంగారుగా ఏదో అరవబోయారు. కాని వీరాస్వామి భయంకరరూపం చూచేసరికి, శబ్దం వాళ్ళ గొంతు దాటి బయటికి రానిలేదు.

ఇంతలో లారీకిందపడింది వీరాస్వామి కొడుకేరోయ్ అంటూ ముందున్న జనంలోంచి ఓ కుర్రాడు పిచ్చికేక పెట్టాడు.

అంతే!

ఒక్కమాటు లోకం అంతా చీకటయింది.

గాలి స్థంభించి పోయింది.

'యేం!' అని ప్రాణం పోతున్న గొఱ్ఱెలా అర్థంలేని ఓ వెఱ్ఱి అరుపు అరిచి లారీలో కూర్చున్న డ్రైవరు, తన ముందున్న స్టీరింగుమీదతల వాల్చేశాడు.

'మావోడా?' - తలమీద పిడుగు పడ్డట్లయింది వీరాస్వామికి. కళ్ళు చీకట్లు కమ్మాయి. రక్త ప్రసరణ ఆగి ఒళ్ళంతా మొద్దుబారి పోయింది.

వెంటనే పిచ్చెక్కిన పెద్దపులిలా వినేవాళ్ళ గుండెలు అదిరిపోయే లాంటి భయంకరమైన ఓ పెడబొబ్బపెట్టి, లారీలోఉన్న డ్రైవరు మీదకి మృత్యువులా లంఘించాడు వీరాస్వామి.

ముందు వెనకా ఉన్న జనం అంతా అదిరిపడ్డారు. విద్యుద్ఘాతం తగిలినట్లు కెవ్వున అరిచి, భయంతో కళ్ళు మూసేసుకున్నారు.

o o o

ఒక్క దెబ్బ!

ఇంకో క్షణంలో ఒక్క దెబ్బతో డ్రైవరుతల బద్దలై పోతుంది.

ప్రాణాలు ఉగ్గబట్టుకుని ఉన్నారంతా.

దెబ్బ!- చావుకేక!- రక్తపు మడుగు!

పోలీసులు! కేసులు! సాక్ష్యాలు!

కోర్టులు - జడ్జీలు - తీర్పులు -

శిక్ష!

డ్రైవర్ని చంపిన వీరాస్వామికి ఉరిశిక్ష!

నిజంగానా? ఉరిశిక్ష రడిందా? హమ్మయ్య!
సీత విరగడై పోయింది.
శివిగాడు చచ్చాడు!
ఇంక హాయిగా బతకొచ్చు.
ఆనంద, సంతోష, సంరంభాలు!
కేకలు, కేరింతాలు, చప్పట్లు.
ముగ్గులు - దీపాలు - తోరణాలు,
మిఠాయిలు - పటాసులు - మతాబులు
ఓహో!

చెప్పలేనంత కోలాహలంగా ఊహించలేనంత ఉత్సాహ ఉద్రేకాలతో ఊగిపోతున్న జనం-

పురివిప్పిన నెమలులులా గంతులు వేస్తున్న హృదయాలతో బంగారు కలలు కంటూన్న జనం-

మధురానంద గానంలో మనస్సుల్ని మేళవించి మరీ వింటూన్న జనం-

రంగుల కలలు - రమణీయమైన ఊహలు - అమరానందాన్ని నూన్న సున్న శాంతి సంగీతం - సంగీతంతో నిండిపోయిన కలలు. కలల్లోకి తీసుకుపోతున్న నిశ్శబ్ద సంగీతం -

కల - సంగీతం - సంగీతం - కల.

○ ○ ○

జాలిగా వీరాస్వామి అరిచిన అరుపుతో కల కరిగి పోయింది - సంగీతం ఆగిపోయింది.

గాండ్రించే పెద్దపులి స్థానంలో గంగిగోవు!

నిప్పులు కక్కవలసిన వీరాస్వామి కళ్ళల్లో నీళ్ళు !
మృత్యువులాంటిముఖంలోఆందోళనా ఆరాటమూను.
వీరాస్వామి చేతులు వణుకు తున్నాయి.
ఒళ్ళంతా వణికిపోతుంది.
చేతిలోకర్ర దానంతట అదే జారిపోతోంది.

నోటికి గుప్పెళ్ళు అడ్డం పెట్టుకుని దైన్యంగా 'ఎంత పని చేశావు డ్రైవరూ ! నేను సంపేస్తానని గుండెపగిలి నువ్వే సచ్చిపోనావా? కాలుపోయినా కొడుకేనా నాకు మిగిలాడు.... కాని....అళ్ళకి ?....నువ్వొత్తావు వొత్తావు అంటూ కంట్లో వొత్తులెట్టుకుని గుమ్మంలో ఎదురు సూత్తూండే నీ పెళ్ళానికీ, అయ్యొచ్చి ఎత్తుకుంటాడంటూ గడపమీద ఆసట్టునే కూసున్న బిడ్డలకీ....అళ్ళకి....అళ్ళకేం మిగిలింది డ్రైవరూ ! ఇస్! ఇయ్యాల ఏం అన్యాయం జరిగిపోయిందిరా భగవంతుడా !" అంటూ లారీలోంచి నిర్జీవంగా దిగుతూన్న వీరాస్వామిని చూసేసరికి అక్కడున్న జనానికి ఇదీ అని చెప్పలేని ఏదో వెఱ్ఱిబాధా, భయం, ఆరాటం, ఆవేదనా, చలిగాలుల్లా వెన్నుపూసల్లోంచి జివ్వుమంటూ పరిగెట్టాయి. చచ్చిపోయిన డ్రైవరు కోసం వీరాస్వామి మనస్సు ఎంత విలవిల్లాడిందో, అనుకున్న ప్రకారం హత్యా ఉరిశిక్షా ఏం జరక్క చావకుండా మిగిలిపోయిన వీరాస్వామిని చూసి అంతకంటే ఎక్కువగానే అదుర్దా పడ్డాయి పాపం ఆ ఊరి వాళ్ళ హృదయాలు!

---